# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 20 సెప్టెంబరు, 2026 | పేజీలు : 08


## పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/నల్లబెల్లి : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లెక్కల్లో ప్రతిభకు పరీక్ష పెట్టి సామర్థ్యాన్ని స్వయంగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారధ పరీశీలించారు. శనివారం నల్లబెల్లి మండలంలోని బోల్లోని పల్లి, శనిగరం ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మీక తనీఖీ చేసి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యంపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటిస్తు వారి విద్య అభ్యసనా సామర్థ్యన్ని తెలసుకున్నారు. ముఖ్యంగా గణితంపై విద్యార్థుల అవగాహనను స్వయం గా పరిక్షించి వివిధ లెక్కలు గణిత సమస్యలను విద్యార్థులకు ఇచ్చి వాటిని ఏవిధంగా పరిష్కరిస్తున్నారో పరీశీలించారు. పాఠశాల తనీఖీలో నర్సంపేట అర్డిఓ ఉమారాణి, తహసిల్దార్ ఎం.కృష్ణ తదితరులు పాల్గోన్నారు.

# ప్రపంచ పర్యాటక దినోత్సవానికి కార్యాచరణ సిద్ధం చేయండి

### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ప్రజాపక్షం/హనుమకొండ : ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో పర్యాటక శాఖ వివిధ కార్యక్రమాల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 27న నిర్వహించే ప్రపంచ దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణపై పర్యాటక, విద్యా, పురావస్తు, అటవీ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ చారిత్రక ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. యువ టూరిజం క్లబ్ లో నమోదయి ఉన్న విద్యార్థులకు పర్యాటక, వారసత్వ సంపద పై మండల, జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈఓ,డిఐఈఓలకు సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన ఉదయం 6:00 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో యోగ కార్యక్రమాలు, 25వ తేదీన హనుమకొండ పద్మాక్షి జైన దేవాలయం, సిద్దేశ్వరాలయం వద్ద హెరిటేజ్ వాక్ ను పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని పేర్కొన్నారు.హెరిటేజ్ వాక్ లో యువ టూరిజం క్లబ్ విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. 26వ తేదీన ఉదయం 7 గంటలకు తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటకశాఖ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా చేపట్టే కార్యక్రమాలను ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా అటవీ శాఖ అధికారి ముకుంద రెడ్డి, డీఈవో గిరిరాజ్ గౌడ్, హనుమకొండ ఏసీపీ నరసింహ రావు, అడిషనల్ డీఆర్డీఏ వెంకటేశ్వర్లు, జీడబ్ల్యూఎంసి సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, ఇరిగేషన్ ఈఈ మంగీ లాల్, డీఐఈవో గోపాల్, కేంద్ర పురావస్తు అధికారి అజిత్ కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనివాస్ రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



### నానో ఎరువులతో

## పంటలకు అధిక ప్రయోజనాలు




ప్రజాపక్షం/కొమురవెల్లి: నానో ఫర్టిలైజర్ ఎరువుల వినియోగంతో పంటలకు అనేక ప్రయోజనాలు కలిగి, సాగు ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారిణి వెంకట్రావమ్మ తెలిపారు. మండలంలోని గౌరయపల్లి గ్రామానికి చెందిన రైతు నరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి సాగు చేస్తున్న వరి పంటను శనివారం కిష్టంపేట శివారులో ప్రయోగాత్మకంగా పరిశీలించారు. పంటకు నానో యూరియాను డ్రోన్ ద్వారా పిచికారీ చేయించారు. అనంతరం సర్పంచ్ బొచ్చు రాజు అధ్యక్షతన నిర్వహించిన రైతుల అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకట్రావమ్మ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, పత్తి, కంది తదితర పంటల్లో రెండో దఫా ఎరువుల వినియోగ సమయంలో నానో ఫర్టిలైజర్లను సిఫారసు చేసిన మోతాదులో ఉపయోగించవచ్చని తెలిపారు. డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల ఎరువులు సూక్ష్మ బిందువుల రూపంలో పంటకు చేరుతాయని పేర్కొన్నారు. పంటలకు అవసరమైన పోషకాలను సమర్థవంతంగా అందించేందుకు నానో ఎరువులు ఉపయోగపడతాయని తెలిపారు. యూరియాను అధికంగా వినియోగించడం వల్ల పంటలో అధిక పచ్చదనం ఏర్పడి చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందని, దీంతో పురుగుమందుల వినియోగం పెరిగి రైతులపై అదనపు పెట్టుబడి భారం పడుతుందని వివరించారు. నానో ఎరువులను వ్యవసాయ శాఖ సూచించిన మోతాదులో వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను నియంత్రించుకోవచ్చని సూచించారు. నానో ఎరువులు యూరియా, డీఏపీ, పొటాష్ వంటి పోషకాలను ద్రవ రూపంలో అందించే విధంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నీలకొండయ్య, రైతులు బొచ్చు మహేష్, రవీందర్‌రెడ్డి, బొచ్చు కిషన్, కొయ్యడ కనకయ్య, అంజయ్య, బాలయ్య, మహేష్, చిట్యాల అశోక్, కనకయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

### వివాదాలకు తావు లేకుండా

## భూ రికార్డులు సిద్ధం చేయాలి

### ఎమ్మెల్యే గండ్ర, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/భూపాలపల్లి: అధికారులు సమన్వయంతో పని చేసి భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా స్పష్టమైన రికార్డులను సిద్ధం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ లు అధికారులను ఆదేశించారు.శనివారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లాలో అటవీ భూముల సరిహద్దులు, భూ రికార్డుల నిర్వహణ, ఆక్రమణల నియంత్రణ, చెరువులు, సరస్సుల పరిరక్షణతో పాటు పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై రెవెన్యూ, అటవీ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్ శర్మ లు మాట్లాడుతూ జిల్లాలో అటవీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల పరిధిలోని సమస్యలను పరస్పర సమన్వయంతో పరిష్కరించాలన్నారు. గ్రామాల వారీగా చేపడుతున్న సర్వే ఆధారంగా అటవీ భూముల విస్తీర్ణం, సర్వే నంబర్లు, సరిహద్దుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా స్పష్టమైన రికార్డులను సిద్ధం చేయాలని తెలిపారు. కొత్తగా అడవులను నరికివేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, అక్రమంగా చెట్ల నరికివేతకు పాల్పడే వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పట్టా భూములు కలిగి ఉన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అదే సమయంలో కొత్తగా జరిగే ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు సంబంధించిన అంశాలపై సబ్‌డివిజన్ స్థాయిలో ఆర్‌డీవో, ఎఫ్‌డీవోల కమిటీల ద్వారా అసైన్‌మెంట్ భూముల వివరాలను సేకరించి, జిల్లా కమిటీ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదికలు పంపే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. పూజారులకు అవసరమైన వసతులతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, కిష్టా గౌడ్, ఆర్‌డీఓ హరికృష్ణ, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.



## చాకిరేవుగుట్ట అనుమతులను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/నడికూడ :** పరకాల నియోజకవర్గం లోని నడికూడ మండలం కంఠాత్మకూర్ వాగు మాటు వద్ద మైనింగ్‌కు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ,నడికూడ మండల అధ్యక్షులు ఎరుకల దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యవేక్షణ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా.పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన విలేక రుల సమావేశంలో డా.పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ కంఠాత్మకూర్ వాగు మాటు చుట్టుప క్కల ప్రాంత ప్రజల జీవనాధారంతో ముడిపడి ఉన్న ముఖ్యమైన సహజ వనరని, అక్కడ మైనింగ్ కార్యకలాపాలకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని మాటు వద్ద ఉన్న గుట్ట గ్రామానికి రక్షణగా ఉండటంతో పాటు, స్థానిక ప్రకృతి సమ తుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోందని మాటు సుమారు ఐదు గ్రామాల రైతులకు జీవనా ధారం. కంటాత్మకూర్ వాగు మాటు వద్ద ఇచ్చిన మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేసి,గుట్టను, మాటును,తాటి వనాన్ని,నీటి వనరులను స్థానిక ప్రజల జీవనాధారాలను రక్షించాలని డా.పగడాల కాళీ ప్రసాద్ రావు డిమాండ్ చేశారు.ఈ కార్యక్ర మంలో మండల్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పున్నం వేణు, సతీష్,గునిపర్తి సర్పంచ్ కరుణాకర్, మాద న్నపేట సర్పంచ్ రమేష్,శనిగరం సర్పంచ్ రాజ్ కుమార్, సుధీర్, జీవన్ రెడ్డి,దండు సురేష్, బీఆర్ ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు గుడికందుల శివ, రైతులు, గౌడ, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం

**ప్రజాపక్షం/వేలేరు:** వేలేరు మండలంలో నేడు విద్యుత్ నిలిపివేయడం జరుగుతోందని ఏఈ కుమా రస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఆదివారం రోజున మండలకేంద్రంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్నందున ఉదయం 9,గంటల నుండి 12 గంటల వరకు,11కెవి కమ్మరిపేట 11కెవి వేలేరు ఎజిఎల్ విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుంది,12 గంటల నుండి ,3.00 వరకు 11కెవి శాలపల్లి 11కెవి వేలేరు టౌన్ విద్యుత్ నిలిపివేయడం జరుగు తుంది కనుక విద్యుత్ వినియోగదారులు,రైతులు సహకరించాలని కోరారు.

## ఘనంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/వెంకటాపూర్ (రామప్ప):** ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం వెంకటా పూర్ మండల కేంద్రంలో ఎన్ ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు కోటి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన చౌర స్తాలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు పలువురికి స్వీట్లు పంచిపెట్టారు. అంతేకా కుండా హనుమాన్ టెంపుల్ వద్ద ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద సాయంత్రం వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ మామిడి శెట్టి సుగుణ స్వామి ఆధ్వ ర్యంలో సుమారు 500 మందికి పైగా మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ స్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కెసిఆర్ కుటుంబం ప్రజలకు సమాధానం చెప్పాలి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** తెలంగాణ పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ కుటుంబానికి 2014లో ఉన్న ఆస్తులు ఎన్ని, 2024లో ఉన్న ఆస్తులు ఎన్నో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు చెప్పా లని తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్య మంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో చేప ట్టిన పలు అభివృద్ధి పనుల కార్యక్ర మానికి ముఖ్య అతి థిగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. అంతకు ముందు గా మండల కేంద్రం లోని రైతు వేది కలో మండలానికి సంబంధించిన 24 మంది కళ్యాణ లక్ష్మి లబ్దిదారులకు 24 లక్షల 02 వేల 784 రూపా యల విలువగల చెక్కులను పంపిణి చేసారు. అదే విధంగా 35 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 18 లక్షల 25 వేల 500 రూపాయల విలువగల చెక్కు లను లబ్దిదారులకు పంపిణి చేశారు. అనంతరం మండల కేంద్రంలో 33 లక్షలతో నిర్మించనున్న ఆహార దినుసుల గోదాం నిర్మాణానికి అయన శంకు స్థాపన చేశారు. అలాగే 10 లక్షలతో నిర్మించనున్న ఎస్సి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులతో పాటు, 10 లక్ష లతో నిర్మించనున్న కుర్మ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అంతేకాకుండా 10లక్షలతో నిర్మించిన వివో భవనం అయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోనాసి క్రాంతి కుమార్, తహసీ ల్దార్ బైరెడ్డి రాజేష్, ఎంపిడివో కావ్య, పంచాయ తీరాజ్ డిఈ ఎస్.కిరణ్ కుమార్, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కడారి మహేందర్, వివిధ గ్రామాల సర్పం చులు,నాయ కులు కార్యకర్తలు,మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కుళ్లిన కూరగాయల సరఫరాపై విచారణ జరపాలి



**ప్రజాపక్షం/ములుగు:** మల్లంపల్లి సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో విద్యార్థు లకు కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు తయారు చేస్తున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎ ఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి టివిఎల్ రవి డిమాండ్ చేశారు. నాసిరకం కూర గాయలు సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు, నిబంధనలకు విరు ద్ధంగా సరఫరా జరిగినట్లు తేలితే కూరగాయల టెండ ర్‌ను రద్దు చేయాలని కోరారు. గత వారం ఈ పాఠశా లలో కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు తయారు చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చిందని రవి తెలి పారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యం, సంబంధిత అధికారులపై ఉందన్నారు. నాసిరకం కూర గాయలను వంటల్లో వినియోగించడం విద్యార్థుల ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై అధికా రులు తక్షణమే స్పందించి పాఠశాలలో ఆహార నాణ్యతను పరిశీలించాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు కూరగాయల సరఫరాకు సంబంధించిన బిల్లుల చెల్లింపు లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ప్రతి రోజూ నాణ్యమైన కూరగాయలతో భోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రవి కోరారు. విద్యార్థుల సమస్యల పరి ష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని, మల్లంపల్లి పాఠశాల ఘటనపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎన్ఐటీ కాన్వొకేషన్ విద్యార్థుల జీవితంలో మధురమైన మైలురాయి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** నేషనల్ ఇన్స్టి ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో శనివారం జరిగిన కాన్వొకేషన్ కార్యక్రమం విద్యార్థుల జీవితాల్లో ఒక మరపురాని ఘట్టంగా నిలిచిందని ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. ఎన్నో సంవత్సరాల కఠోర శ్రమ, పట్టుదల, కృషికి ప్రతిఫలంగా విద్యార్థులు పట్టాలను అందుకోవడంతో పాటు ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులు బంగారు పతకాలు, వివిధ సర్టిఫి కెట్లు, పురస్కారాలను అందుకోవడం ఎంతో ఆనం దాన్ని కలిగించిందన్నారు.కాన్వొకేషన్ అనేది కేవలం పట్టాలు అందించే కార్యక్రమం మాత్రమే కాదని, విద్యా ర్థులు తమ విద్యాభ్యాసాన్ని విజయవంతంగా పూర్తిచే సుకుని, భవిష్యత్ జీవితంలో కొత్త బాధ్యతలు, కొత్త అవ కాశాల వైపు అడుగులు వేసే ముఖ్యమైన మైలురాయి అన్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు తమ పిల్లలు సాధించిన విజయాన్ని ప్రత్యక్షంగా చూసి గర్వపడటం, విద్యార్థుల ముఖాల్లో కనిపించిన ఆనందం ఈ కార్యక్ర మానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు. ఎన్ ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో విద్యను పూర్తి చేసి పట్టా పొందడం విద్యార్థులకు గొప్ప గౌరవం అని, ఇక్కడ పొందిన జ్ఞానం, నైపుణ్యాలు వారి భవిష్యత్ కెరీర్‌కు బలమైన పునాదిగా నిలుస్తాయన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను సమాజ అభివృద్ధికి ఉపయోగించి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు.

## శ్రీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసం



**ప్రజాపక్షం/ములుగు:** మల్లంపల్లి సెక్టార్ పరిధిలోని శ్రీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ్ మాసం సందర్భంగా పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వ హించారు. జిల్లా సంక్షేమాధికారి ప్రేమలత, సిడిపిఓ శిరీష, సూపర్‌వైజర్ కమరున్నీసా, గ్రామ సర్పంచ్ ఆకుల మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో వివిధ శాఖల అధికారులు పోషకాహార ప్రాము ఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా జిల్లా సంక్షేమాధికారి ప్రేమలత మాట్లాడుతూ పిల్లలకు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలని, తక్కువ ఖర్చుతో లభించే అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చని సూచించారు. సిడిపిఓ శిరీష మాట్లాడుతూ అందుబాటులో ఉన్న కూరగాయలు, ధాన్యాలు, పండ్లు తదితర పోషకాహార పదార్థాలను ప్రతి రోజూ ఆహా రంలో భాగం చేసుకోవాలని తెలిపారు. సర్పంచ్ ఆకుల మల్లేష్ మాట్లాడుతూ శిశువులకు తప్పనిసరిగా ఆరు నెలల వరకు తల్లిపాలు అందించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పాఠ శాల హెచ్ఎం, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్ బి ఉమా రాణితో పాటు తల్లులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ధర్మసాగర్ మండలం కేశవనగర్ గ్రామం వద్ద గుర్తుతెలియని దుండగుల దాడిలో తీవ్రంగా గాయపడి, వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్ ను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామ ర్శించారు.స్వయంగా ఎంజిఎం ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు లక్ష్మణ్ నాయక్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్య సేవలు అందించా లని ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యుల బృందానికి సూచించారు. అనంతరం బాధితుడు ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యుల బృందం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడిశాలలో భక్తి శ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం

**ప్రజాపక్షం/తాడ్వాయి :** మండలంలోని లింగాల గ్రామపంచాయతీ పరిధిలో గల కోడిశాల గ్రామంలో వినాయక నవ రాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శని వారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నిర్వహణ దారులు మొగిలి కుటుంబ సభ్యులతో పాటు సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ సరిత దంపతులు గణపతికి శోస్త్రోక్తంగా పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం నైవేద్యం సమర్పించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. స్వామి వారి కృపతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లా లని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామ ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ఎన్ఐటి వరంగల్ 24వ స్నాతకోత్సవం

**ప్రజాపక్షం/కాజీపేట :** వ్యక్తిత్వమే భవిష్యత్తును నిర్ణయిస్తుందని ఎన్ ఐటి వరంగల్ విద్యార్థులకు టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్స్ ఇండియా ఎండీ సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఎన్ఐటి వరంగల్ లో ఘనంగా స్నాతకోత్సవం ప్రారంభమైంది.24వ స్నాతకోత్సవం తొలి రోజు 930 మంది అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, 22 మంది ఎగ్జిట్ డిగ్రీ విద్యార్థులకు పట్టాల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్లను వ్యక్తిగతంగా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి అభినందించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ 24వ స్నాతకోత్సవం రెండు రోజుల కార్యక్ర మంగా అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభంలో టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్స్ ఇండియా ఎండీ సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వం, సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. స్నాతకోత్సవం తొలిరోజైన సెప్టెంబర్ 19న 930 మంది అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, 22 మంది ఎగ్జిట్ డిగ్రీ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కార్య క్రమానికి టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా, ఎన్ఐటీ వరంగల్ బోర్డ్ ఆఫ్ గవ ర్నర్స్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి గౌరవ అతిథిగా, ఎన్ ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి హాజరయ్యారు. అకడమిక్ ప్రొసెషన్‌తో ప్రారంభమైన స్నాతకోత్సవం అకడమిక్ ప్రొసెషన్, జాతీయ గీతంతో స్నాతకోత్సవ కార్యక్రమాలు ప్రారంభమ య్యాయి. అనంతరం చైర్‌పర్సన్, ముఖ్య అతిథి ప్రసంగాలు, గౌరవ డిగ్రీల ప్రదానం, అండర్‌గ్రాడ్యుయేట్ డిగ్రీల ప్రదానం, పతకాలు అవార్డుల ప్రదానం జరిగాయి.

## విద్యుత్ శాఖ అధికారులు ఆదిమరిస్తే భారీ మూల్యం చెల్లించాల్సిందే?

**ప్రజాపక్షం/వేలేరు:** వేలేరు మండలకేంద్రంలోని నడిబొడ్డున బొడ్రాయి సమీపంలో ఉన్న మని ట్రాన్స్ ఫార్మర్ ను ఆదిమరిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోందని గ్రామప్రజలు చర్చించుకుంటు న్నారు.ఇదే ప్రదేశంలో వినాయకుడి విగ్రహం ఏర్పటా చేయడం ఈప్రదేశం గుండా ప్రభుత్వ పాఠశాలోకి విద్యుత్ సరఫరా అవుతోంది ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్యుత్ వైర్లు చెట్ల కొమ్మలకు తాకుతు న్నాయి వర్షాలు కురిస్తే వినాయకుడి(బొడ్రాయి) వద్ద,పాఠశాలలో ఆదిమరిస్తే విద్యుత్ షాక్ తగిలితే భారీ చెల్లించాల్సి వస్తోందని గ్రామంలో పలువురు చర్చింకుంటున్నారు.

## హేమాచలుని దర్శించుకున్న ఎస్పి



**ప్రజాపక్షం/మంగపేట:** మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లూరు హేమచల కొండల్లో వెలసిన శ్రీ లక్ష్మి నృసింహ స్వామి చెంచులక్ష్మి ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆలయం శనివారం హేమచల నృసింహుని దర్శనానికి భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్ కుటుంబ సమేతంగా వచ్చి దర్శించుకున్నారు. ముందుగా అలయ సాంప్రదాయ ప్రకారం అలయ ప్రధాన అర్చకులు ముక్కామల రాజశేఖర్ శర్మ స్వాగతం పలికారు తరువాత గర్భలయంలో వారి పేరున అర్చన చేసి స్వామి వారి విశిష్టత చింతామణి జలపాతం మహిమలు వివరించి ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు శేష వస్త్రాలు ఆలయ అర్చకులు ఎస్పీ రోహిత్ రాజ్ కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ టీవీఆర్ సూరి, అలయ అర్చకులు పోలిస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకు అశోక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గోవిందరావుపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద పసర గ్రామంలోని రామాలయం వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు అనంతరం పసరలోని వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు ఈ సందర్భంగా పాలడుగు వెంకటకృష్ణ మాట్లాడుతూ పైడాకుల అశోక్ పార్టీ కోసం కార్యకర్తల కోసం నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేస్తున్నారని పేర్కొన్నారు అసెంబ్లీ పార్లమెంట్ స్థానిక సంస్థలు సర్పంచ్

## మీ సేవలో బుకింగ్‌కు అవకాశం

**ప్రజాపక్షం/కమలాపూర్:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా, ఇతర ఫర్టిలైజర్ ను బుకింగ్ చేసుకోవడానికి, మీ సేవ నందు అవకాశం కల్పించిందని మండల వ్యవసాయ అధికారి వేణు తెలిపారు. కమలాపూర్ మండలంలోని రైతు సోదరులు మీ సేవలో ఉన్నటువంటి ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ వినియోగించుకోవాలని అన్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్నటువంటి రైతులు ప్లే స్టోర్ లోకి వెళ్ళి ఎఫ్ ఎఫ్ఎస్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోని బుక్ చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా ఎలాంటి సమస్యలు ఉన్న మండల వ్యవసాయ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఎంతోమందిని అత్యున్నతమైన స్థానంలో ఉంచే మార్గ నిర్దేశకులే గురువులని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఐడిఓసి కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలసి డా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువును మించిన దైవం లేదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బోధన, మార్గనిర్దేశంతో ఎంతోమంది విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్‌లు, వైద్యులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు తదితర రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు.

**తన చిన్ననాటి విద్యాభ్యాసాన్ని గుర్తుచేసుకున్న ఎమ్మెల్యే:** ఘన్పూర్ ప్రభుత్వ పాఠశాలలో మాస్టర్‌గా పనిచేసిన తన గురువు గోపాల్‌రావు ఉచితంగా ట్యూషన్ చెప్పి తన విద్యాభివృద్ధికి తోడ్పడ్డారని తెలిపారు. తాను సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో 8, 9, 10 తరగతులు చదువుకున్నానని, ఈ స్థాయికి ఎదగడానికి తన గురువులు అందించిన విద్య, మార్గదర్శకత్వమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోట రాజబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, మున్సిపల్ ఛైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ ఛైర్మన్ అంబాల శ్రీనివాస్ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలోని జంక్షన్ల అభివృద్ధిని వేగవంతం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణ సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. పట్టణంలో రహదారుల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్ సిగ్నల్స్ పునర్వ్యవస్థీకరణ, తాగునీటి పైప్‌లైన్లు, విద్యుత్ లైన్ల తరలింపు తదితర అంశాలపై శనివారం ఐడీఓసీ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అటవీశాఖ అధికారి కిష్టా గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్, అదనపు కలెక్టర్ మున్సిపల్, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పబ్లిక్ హెల్త్, సింగరేణి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి కృష్ణా కాలనీ వరకు, అంబేద్కర్ జంక్షన్ నుంచి ఓసీ2 వరకు రహదారి విస్తరణ పనులకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



**విద్యుత్ స్తంభాల తరలింపునకు అంచనాలు**

రహదారి విస్తరణ పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి, వాటిని తరలించేందుకు అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సిద్ధం చేసిన అంచనాలను మున్సిపల్ కమిషనర్‌కు అందించి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, అటవీ అధికారి కిష్టా గౌడ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఉదయ్ కుమార్, ప్రజారోగ్య, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టేకుమట్ల పోలీస్‌స్టేషన్ తనిఖీ



**ప్రజాపక్షం/టేకుమట్లః** ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని భూపాలపల్లి డిఎస్పి సంపత్‌రావు సూచించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డిఎస్‌పి సంపత్ రావు మాట్లాడుతూ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను పరిష్కరించేలా పోలీసులు పనిచేయాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డిఎస్‌పి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అమూల్య, సిబ్బంది పాల్గొన్నారు.

## అణిచివేత బానిసత్వాన్ని బద్దలు కొట్టాలి



**ప్రజాపక్షం/చిట్యాలః** బిసి, ఎస్‌సి, ఎస్‌టిల బానిసత్వం కటిక పేదరికం అణిచివేత బద్దలు కొట్టాలంటే ఒక రాజకీయ భూకంపం జనంలో రావాలని, అందుకోసం ప్రజలలో సామాజిక సమరం రాజ్యాధికార యుద్ధం రగిలించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతల రమేష్ ముదిరాజ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం సామాజిక న్యాయం రాజ్యాధికారం అనే నినాదంతో బిసి, ఎస్‌సి, ఎస్‌టి జేఏసి ఆధ్వర్యంలో ధర్మసమాజ్ పార్టీ మద్దతుతో ఎవరి కులమెంతో వారికంత వాటా బహిరంగ పంచాయతీ సభ కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతల రమేష్ ముదిరాజ్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి పుల్ల మల్లయ్య మాదిగ మాట్లాడుతూ వేల సంవత్సరాల నుండి తెలంగాణ ప్రాంతం అతిపెద్ద అగ్రవర్ణ భూస్వామ్య వ్యవస్థ ఈ వ్యవస్థ కింద మన సబ్బండ కులాలైన 90 శాతం బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు తరతరాలుగా దోపిడికి గురై బానిసలుగా నలిగిపోయి కాలిపోయి నశించిపోయారన్నారు. భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలైన రోజు నుండి బిసి, ఎస్‌సి, ఎస్టి జీవితాలలో కొంత మార్పు ప్రారంభమైంది కానీ ఆ కొద్ది మార్పు తరతరాల తమ జీవిత విధ్వంసానికి ఏ మాత్రం సరిపోదు సమాధానం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజు యాదవ్, పర్లపల్లి వంశీ మాదిగ, బిసి, ఎస్‌సి, నాగరాజు, అశోక్, నేరెళ్ల రమేష్, రమేష్, మట్టేవాడ కుమార్, చిలుముల శశికుమార్, చిలుముల కృష్ణ, బొడ్డు పాల్ చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి, మాజీ ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలిసిన సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు



**ప్రజాపక్షం/జనగామ:** కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జనగామ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన జాయ మల్లేష్ శనివారం భువనగిరి ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన జాయ మల్లేష్‌ను ఎంపి కిరన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలు శాలువాతో సత్కరించారు. జనగామ జిల్లాలో పార్టీ విస్తరణ, సేవాదళ్ బలంగా పెంచడం కోసం కృషి చేయాలన్నారు. ఎంపి, మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు సత్యనారాయణ, డిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నరేందర్ పవార్ ఉన్నారు.

## విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులకు ధరఖాస్తులు

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ జిల్లా నివాసులై అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీలకు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటిలో సభ్యులుగా నియమించబడుటకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విక్రమ్ తెలిపారు. 1995 లోనాఇ రూల్ 17 ప్రకారం జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ జనగామ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కమిటీలో జిల్లా ఎస్సీ, ఎస్టీ యాక్ట్ 1989 అమలు సమీక్షించడంతో పాటు అఘాయిత్యాల బాధితులకు ఉపశమనం, పునరావాసం కల్పించడం, కేసుల ప్రాసిక్యూషన్ అంశాలను పర్యవేక్షించనుందన్నారు. ఇందులో ఐదుగురు సభ్యులు ఉండనుండగా ఎస్సీ(ఎ), ఎస్సీ (సి) నుండి ఖాళీలు ఉన్నాయన్నారు. ప్రభుత్వేతర సంస్థలతో అనుబంధం కలిగిన ఇతర వర్గాలకు చెందిన వారు ముగ్గురు సభ్యులను నియమించవచ్చున్నారు. పదవి కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. అర్హులైన వారు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## ఆర్‌టిసి బస్టాండ్‌లో స్వీపర్ల సంఖ్య పెంచాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ ఆర్టీసి డిపో పరిధిలో పనిచేస్తున్న స్వీపర్ల సంఖ్య పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ కోరారు. శనివారం నాడు సీఐటీయూ ఆధ్వర్యంలో జనగామ డిపో మేనేజర్ ఎం ఉషాకి ఆర్టీసి స్వీపర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ మహిళలకు మహాలక్ష్మి వల్ల ప్రయాణికుల సంఖ్య పెరుగడంతో పాటు బస్టాండ్ ఆవరణ కూడా పెరిగిందని దీని వల్ల స్వీపర్లకు పనిభారం పెరిగిందన్నారు. ఇప్పటికైనా స్వీపర్ల సంఖ్య పెంచాలని వారి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్ర, కమల, రేణుక, శోభ, స్వప్న, కోమల, లక్ష్మి , రేణుక, శోభ, పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేయాలి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** స్వచ్ఛంద సంస్థలు, దాతలు ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేయాలని పాలకుర్తి సీఐ భరత్ సుమన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గాదెపాక చారిటబుల్ ట్రస్ట్ పాలకుర్తి ఆధ్వర్యంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు గాదెపాక సంపత్ కుమార్, అనూష దంపతులు పాఠశాల విద్యార్థులకు రూ.80వేల విలువ గల టీ షర్ట్స్ పాంట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చిదురాల శ్రీనివాస్, ఎఎపిసి చైర్‌పర్సన్ శ్రీలత, ట్రస్ సభ్యులు ఆనందం, మోజస్, సాలయ్య, సాలమన్, సత్యనారాయణ, పరుశరాములు, ఎల్లయ్య, యాకయ్య, సారయ్య, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులు...మొక్కలు పంపిణీ



**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** లయన్స్‌క్లబ్ ఇంటర్నేషన్ జఫర్‌గఢ్ తమ్మడపల్లి జి గ్రామంలోని హైస్కూల్, ఉన్నత పాఠశాలలో లయన్స్ ఇంటర్నేషనల్ జిపీ డీజీ డా. చంద్రశేఖర్ ఆర్య, ఆయన సతీమణి డా. రాజేశ్వరి పుట్టిన రోజు సందర్భంగా 40 మొక్కలను ప్రాన్ ఎడ్యుకేషన్ సొసైటీ సహాయంతో హైస్కూల్ హెచ్‌ఎం సీతారాములు, విజయభాస్కర్ రెడ్డి మొక్కలు నాటారు. అదేవిధంగా మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ పుల్ల మోహన్‌రావు వ్యాపారస్తులకు గొడుగులు పంపిణీ చేశారు. అనంతరం తమ్మడపల్లి గ్రామం పర్యావరణం పచ్చగా ఉండాలని లయన్స్ చార్టర్ ప్రెసిడెంట్ మామిడాల పూర్ణచందర్ తెలిపారు.

## రసాభాసగా మండల సమన్వయ సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలకేంద్రంలోని రైతు వేదికలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి,మండల స్పెషల్ ఆఫీసర్ విజయ్‌చంద్ర ఆధ్వర్యంలో శనివారం మండల సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించగా ఈసమావేశానికి హనుమకొండ జిల్లా ట్రైనింగ్ కలెక్టర్ రోహిత్, జడ్‌పిసిఇఒ శ్రీశాద్రి హాజరయ్యారు. మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తుండగా పలుసమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. ముఖ్యంగా ఎక్సైజ్ శాఖ అధికారులు వైన్ షాప్ తరలించడంలో అలసత్వం, విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించడం వలన పంటలు ఎండిపోయే పరిస్థితులు, ఆర్టీసీ శాఖ ఆధ్వర్యంలో బస్ సౌకర్యాలు కల్పించక పోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు సక్రమంగా లేకపోవడం, వ్యవసాయశాఖ అధికారులు నిర్లక్ష్యంతో ఫర్టీలైజర్ షాపు నిర్వాహకులు నకిలీ మందుల అమ్మకాల తీరుపై పలువురు సర్పంచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** విద్యార్థులు రక్షణకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ వేధింపులపై అవగాహన పెంచుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి సందీప సూచించారు. వాణి హైస్కూల్‌లో జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ, జనగామ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రిన్సిపల్ భాస్కరుని సుమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్జి కుమారి సందీప, ఎస్‌ఐ శ్రీకాంత్, న్యాయవాది, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్ పాల్గొని పోక్సో, సైబర్ నేరాలు, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు.

## భూ వివాదంలో ఇరువురికి బైండోవర్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** బచ్చన్నపేట గ్రామ పరిధిలోని చిన్నరామన్‌చర్ల రెవెన్యూ గ్రామ శివారులోని వివాదాస్పద భూమికి సంబంధించి దామర మహేష్, గుర్రాల నరసిరెడ్డి, మధ్య గత కొంతకాలంగా తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ వివాదంపై ఇప్పటికే ఇరువురిపై పరస్పర దాడులకు సంబంధించి నాలుగు కేసులు నమోదయ్యాయి. శనివారం ఇరువురి మధ్య ఘర్షణ జరగడంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బచ్చన్నపేట పోలీసులు ముందస్తు చర్యలలో భాగంగా ఇరువురిని తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. భూ వివాదాలను ఎవరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా సంబంధిత రెవెన్యూ అధికారులు లేదా న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు.

## వినాయక నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆదివారంలోగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం నగర పరిధిలోని మడికొండ చెరువు, బంధం చెరువు, సిద్దేశ్వర గుండం, ఉర్సుగుట్ట చెరువు బేస్తం చెరువు, అగర్తల చెరువు, కట్టమల్లన్న చెరువు, చిన్నవడ్డేపల్లి చెరువు, ముచ్చర్ల చెరువు, హసన్‌పర్తి, భీమారం చెరువు తదితర నిమజ్జన ప్రాంతాలను కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన మౌళిక వసతులు, పారిశుధ్య చర్యలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఐదవ రోజు నుండే వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ముందస్తు చర్యలను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. చెరువుల్లో మిగిలి ఉన్న గుర్రపు డెక్కను తొలగించడంతో పాటు పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన సిబ్బందిని ముందుగానే కేటాయించి, విధుల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పేర్కొన్నారు. విగ్రహాల నిమజ్జనానికి వినియోగించే క్రేన్లకు అవసరమైన ఇంధనాన్ని ముందస్తుగా సమకూర్చుకోవాలని, పారిశుధ్య నిర్వహణను నిరంతరం కొనసాగించాలని సూచించారు.

## అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/ఖానాపురం:** పెన్షన్‌కు అర్హులైన ప్రతి ఒక్కరికి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని బిఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఆర్‌డిఏ ప్రాజెక్టు అధికారికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలోని వృద్ధులందరికి పెన్షన్లు అందించాలని, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి నియోజకవర్గంలో వేలాది మందికి ఆసరా పెన్షన్లు అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పెన్షన్‌ను రూ.4వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల దరఖాస్తులను వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్దయెత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ప్రాపర్టీ సర్వేకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జిఐఎస్) ఆధారంగా సమగ్ర ప్రాపర్టీ సర్వే నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలని బల్దియా కమిషనర్ టి వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో జిఐఎస్ టెక్నికల్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిఐఎస్ ఆధారిత ఆస్తి పన్ను సర్వే నిర్వహణకు సంబంధించి విధి విధానాలు, సాంకేతిక అంశాలు, అవసరమైన డేటా సేకరణ, భవిష్యత్ వినియోగంపై చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ సర్వేలో నగరంలోని ఆస్తులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని శాస్త్రీయంగా నమోదు చేసేలా ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఎన్‌ఐటికి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లు కుడా చీఫ్ ప్లానింగ్ అధికారి, సూపరింటెండెంట్ ఇంజనీర్, సిటీ ప్లానర్, డిప్యూటీ కమిషనర్‌తో సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ సభ్యుల సూచనలు, సాంకేతిక అవసరాలు, నగర భవిష్యత్ అవసరాలను పరిగణలోకి తీసుకొని ఆర్‌ఎఫ్‌పిను సమగ్రంగా రూపొందించాలని కమిషనర్ పేర్కొన్నారు.

## క్వారీకి వ్యతిరేకంగా ఒక్కటవుతున్న గ్రామం

**ప్రజాపక్షం/నడికూడా/పరకాల :** క్వారీకి వ్యతిరేకంగా గ్రామం గ్రామం అంతా ఒకటవుతున్నది. గ్రానైట్ పేరుతో తవ్వకాలు జరిపినట్లైతే అడ్డుకొని తీరుతామని గ్రామస్తులు భీష్మించుకొని కూర్చున్నారు. గ్రామానికి ఎంతో ఆకర్షణగా, దానిపై అనాదిగా దేవాలయాల ఉనికి ఉన్నందున తవ్వకాలు జరిపి గ్రానైట్ ని తీసే ఎలాంటి ప్రయత్నమైనా ముందుకు సాగదని నడికూడా మండలంలోని కంఠాత్మకూరు గ్రామస్తులు ప్రజలు ప్రతినపూనారు. కంఠాత్మకూర్ గ్రామంలో సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన గుట్ట ఉంది. సర్వేనెంబర్ 717 లో గల 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుట్టను గ్రానైట్ పేరుతో ధ్వంసం చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. జిల్లాలోని ఓ గ్రానైట్ వ్యాపారి ఈ గుట్టపై కన్నేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఆ గ్రానైట్ వ్యాపారి తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో పాల్గొని ఆ గుట్టను సొంతం చేసుకోవడానికి పావులు కలిపినట్లు మైనింగ్ వర్గాల ద్వారా తెలిసింది. రెండు నెలల క్రితం గ్రామంలోని కొంతమంది రైతులు ఆ వ్యాపారితో తమ భూములను ఇవ్వడానికి ఒప్పందం చేసుకున్నారని దాని కారణంగా గ్రామానికి పెను ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**క్వారీని అడ్డుకొని తీరుతాం.**

నడికూడ మండలంలోని కంఠాత్మకూరు గ్రామంలో గల గుట్టను గ్రానైట్ పేరుతో ధ్వంసం చేయడానికి ప్రయత్నం చేస్తే అడ్డుకొని తీరుతామని గ్రామస్తులు అంటున్నారు. అక్కడ ఎలాంటి తవ్వకాలు జరపకుండా కాంట్రాక్టర్ ను, అధికారులను అడ్డుకుంటామని గ్రామస్తులు తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులకు అవార్డులు ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి యు శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా వెంకటేశ్వర్లు, అరుణ, రేఖ, లక్ష్మణరావు, నవీన్‌కుమార్, శ్రీనివాస్‌తోపాటు తదితరులను అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయ సంఘం బాధ్యులు తిరుపతిరెడ్డి, లకావత్ లాల్యా, సత్తయ్య, లక్ష్మణ్‌జీ, రమేష్, గోవర్ధన్‌రెడ్డి, శంకరయ్య, ఎంఆర్సీ సిబ్బంది రవీందర్ రెడ్డి, నరసింహులు, రాంచందర్, యాకస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని ఆస్పత్రి వద్ద ఉన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా సమాచార కేంద్రం అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బెజ్జంకిప్రభాకర్, ప్రతిభా సంస్థ ఉపాధ్యక్షులు బోయిని వెంకటస్వామిలు కోరారు. నర్సంపేట పట్టణంలోని మెడికల్ కాలేజీ, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దామోదరి బాయ్‌ని జిల్లా సమాచార కేంద్రం కమిటీ, స్వచ్ఛంద సంస్థలు కలిసి ఆస్పత్రి వద్ద ఆర్టీసీ బస్ స్టాప్, ఆసుపత్రిలో సిబ్బంది బయోమెట్రిక్ సరి చేయుట, హాజరుకాని పేషంట్ల ఫుడ్ అవకతవకల గురించి ఫిర్యాదు చేశారు. వాటిపై స్పందించిన సూపరింటెండెంట్ దామోదర బాయి మాట్లాడుతూ రోడ్డును ఎమ్మెల్యే సహకారంతో మరమ్మత్తు చేయించడం, ఆర్టీసీ అధికారులకు దరఖాస్తు చేయడం జరుగుతుందని, ఆస్పత్రిలోని బయోమెట్రిక్ అవుట్ పేషంట్ల భోజనంలో అవకతవకలపై సమగ్ర విచారణ చేసి సరిచేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

## అన్నదానంలో ఆర్యవైశ్యులది ముందడుగు



**ప్రజాపక్షం/నెక్కొండ:** దానం, దయ, సేవా గుణాల్లో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారని వరంగల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, కోశాధికారి గంధం బొట్టు శ్రీనివాస్ అన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా నెక్కొండ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తరతరాలుగా ఆర్యవైశ్యులు కొనసాగిస్తున్న సేవా సంప్రదాయం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. భక్తితో చేసే అన్నదానం కేవలం ఆకలి తీర్చడమే కాకుండా మానవత్వాన్ని పంచే మహత్తర సేవ అని పేర్కొన్నారు. నెక్కొండలో కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిచ్చి, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాటిపల్లి శివకుమార్, నెక్కొండ పిఏసిఎస్ మాజీ చైర్మన్ మారం రాము, అన్నదాన కర్త గోరంటాల వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో సమగ్ర వికాసం



**ప్రజాపక్షం/నెక్కొండ:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే సమగ్ర వికాసం సాధ్యమవుతుందని ఎంపిడిఓ లావణ్య అన్నారు. సూరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చెన్నారావుపేట జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల పరమేశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఓ లావణ్య, సర్పంచ్ గడ్డం రజిత సురేష్, ఎంఈఓ రవికుమార్ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని లావణ్య పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే పోటీలకు వివిధ పాఠశాలల నుండి సుమారు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి భోజన వసతి కల్పించారు. అధ్యక్ష రెడ్డి సౌజన్యంతో క్రీడాకారులకు స్పోర్ట్స్ టీ షర్టులు, షీల్డులు అందించారు.

## బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ మసూద్ అన్నారు. నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు తమ్మడపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సానిక రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి వివరించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని, ప్రతి బూత్‌ను పార్టీకి బలమైన కేంద్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హరీష్, నాయకులు రమేష్, అఖిల్ మాల, ఉప సర్పంచ్ రాజు, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, బుచ్చిరెడ్డి, లింగారెడ్డి, రాజయ్య, మదుసూధన్‌రెడ్డి, మంజుల, విజయ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాధాష్టమి వేడుకలు

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** బంజారాహిల్స్‌లోని హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో శనివారం శ్రీ రాధాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణ భగవానుని నిత్య సఖీమణి రాధారాణి యొక్క దివ్య ఆవిర్భావ తిథియైన శుభ సందర్భంగా నగరంలోని అనేక మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామి వారి దివ్య ఆశీస్సులను పొందారు. హరే కృష్ణ. మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులైన పూజ్యశ్రీ సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ వారు తమ ప్రవచనంలో రాధాష్టమి యొక్క ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు.

## ఒపెన్ హౌస్

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** సెయింట్ విన్సెంట్ విద్యార్థుల స్టడీ టూర్‌లో భాగంగా శనివారం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఒపెన్ హౌస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు నిర్వహించే విధులను ఎస్ఐ వివరించారు. అలాగే అత్యవసర సేవలు, ఆయుదాల వినియోగంపై విద్యార్థులు తెలిపారు.

## సర్పంచ్ హక్కుల కోసం కృషి



**ప్రజాపక్షం/మద్దూరు/ధూళ్మిట్ట :** తెలంగాణ రాష్ట్ర పంచాయితీ సర్పంచ్‌ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన ధూళ్మిట్ట మండలం జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్‌ను ధూళ్మిట్ట మండల సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌ల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు సంఘం బలోపేతానికి కృషి చేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచ్‌లు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్కూరి కమలాకర్ యాదవ్ మాట్లాడుతూ, సర్పంచ్‌ల సంక్షమం, హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని కమలాకర్ తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి, ధూళ్మిట్ట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాస్, గ్రామ, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, చెట్కూరి కమలాకర్ యాదవ్ అభిమానులు చెట్కూరి కమలాకర్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు.

## వార్డుమెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా కార్తిక్‌రెడ్డి

**ప్రజాపక్షం/చేర్యాల :** చేర్యాల మండల వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా జూపల్లి కార్తక్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం చేర్యాల మండలకేంద్రంలో నిర్వహించిన వార్డు మెంబర్ల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, తదితర పూర్తి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జూపల్లి కార్తిక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జూపల్లి కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ, వార్డు మెంబర్ల సంక్షమం, హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి పలువురు వార్డు సభ్యులు, నాయకులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# పసి పాపకు పునర్జన్మనిచ్చిన వైద్యులు



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి పట్టణంలోని శిశు రక్ష చిల్డ్రన్ హాస్పిటల్ డాక్టర్లు అరుదైన చికిత్స అందించి నవజాత శిశువు ప్రాణాలను కాపాడారు. నెలల నిండక ముందే కేవలం 900 గ్రాముల బరువుతో జన్మించిన శిశువుకు పునర్జన్మ నిచ్చారు. ఉపరితిత్తులు అభివృద్ధి కాకపోవడంతో పాటు కిడ్నీలు పనిచేయకపోవడంతో డయాలసిస్ చేయాల్సి వచ్చింది. వెంటిలేటర్ పై శిశువును ఉంచి విజయవంతంగా చికిత్స అందించారు. 50 రోజుల చికిత్స తరువాత ఆ పసి బిడ్డ బరువు 1.6 కిలోలకు పెరిగింది.

**ఆసుపత్రి కి వెళ్లి అభినందించిన జగ్గారెడ్డి :** అత్యంత విషయంగా ఆరోగ్య పరిస్థితి ఉన్న నవజాతి శిశువును శిశు రక్ష ఆసుపత్రి డాక్టర్లు బతికించారని తెలుసుకున్న జగ్గారెడ్డి స్వయంగా అక్కడికి వెళ్లారు. నవజాతి శిశువును చూసి డాక్టర్లను ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. హైదరాబాద్‌కి వెళ్లాల్సిన అవసరం లేకుండా సంగారెడ్డిలోని అత్యాధునిక వైద్యసేవలు అందించి పసిబిడ్డకు ప్రాణం పోసిన తీరును ఆయన ప్రశంసించారు. శిశు రక్ష ఆసుపత్రి డాక్టర్లు ఆ శిశువును కంటికి రెప్పలా కాపాడి ఆ తల్లిదండ్రుల కళ్లలో సంతోషం నింపారని ఆయన వివరించారు. 50 రోజుల చికిత్సకు గాను దాదాపు నాలుగు లక్షల పైగా బిల్లు అయింది. శిశువు తల్లిదండ్రులు రెండు లక్షలు వరకు చెల్లించారు. మిగతా మొత్తాన్ని తాను చెల్లిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. కానీ ఆసుపత్రి యాజమాన్యం బిల్లులో సగం మినహాయింపు ఇచ్చింది.

# పేద వైద్య విద్యార్థికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ఆపద ఉందంటే క్షణం ఆలస్యం చేయకుండా ఆపన్న హస్తం అందించేవాళ్ళు అరుదుగా ఉంటారు. ఇచ్చిన మాటను తూచా తప్పకుండా నిలబెట్టుకునే వ్వాళ్లు కూడా నేటి సమాజంలో అరుదుగానే కనిపిస్తారు. ఈ రెండు లక్షణాలను పుణికి పుచ్చుకొని ప్రజాసేవే పరమావధిగా నిలుస్తున్న నాయకుడు సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు. తన ఇంటి తలుపు తట్టి తిరిగి వచ్చే వాళ్లలో సంతోషం, సంతృప్తి కనిపిస్తాయి. ఇలా వేలాది మందికి అనేక విధాలుగా సహాయం అందించి వారిలో సంతోషాన్ని కలిగించారు. తాజాగా కొండంత కష్టంలో ఉన్న అఖిల అనే నిరుపేద విద్యార్థినికి అండగా నిలబడి మానవత్వాన్ని చాటారు. నాలుగేళ్ల క్రితం తండ్రిని కోల్పోయి చదువుకునే ఆర్థిక స్తోమత లేక అఖిల తన బంధువులతో కలిసి హరీష్ రావు గారిని ఆశ్రయించింది. ఆయన స్వయంగా సిద్దిపేటలోని మెరీడియన్ విద్యాసంస్థల నిర్వాహకులతో మాట్లాడి అఖిలకు 9 , 10 తరగతిలతో పాటు ఇంటర్ చదువు చెప్పించారు. డాక్టర్ చదవాలని తన కోరికను మరింత ప్రోత్సహించి నీట్ పరీక్ష రాయమని సూచించారు. ఎంబిబిఎస్ సీటు ఎక్కడ వచ్చినా ఆ ఖర్చులు తానే అందిస్తానని అఖిలకు మాటిచ్చారు. అఖిల కష్టపడి చదవి కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. శనివారం రోజున ఉదయం అఖిల స్వయంగా వచ్చి హరీష్ రావుని కలిసి విషయం చెప్పడంతో ఆయన చాలా సంతోషించి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఖర్చులకు సరిపడా ట్యూషన్ ఫీజు, కాలేజ్ ఫీజు 70వేలు ఆర్థిక సాయం అందించారు. ఎంబిబిఎస్ తో పాటు, పీజీ వైద్య విద్య పూర్తయ్యేదాకా తానే చూసుకుంటానని మళ్లీ మాట ఇచ్చారు. భర్త ను కోల్పోయిన భార్య.. తండ్రిని కోల్పోయిన బిడ్డలు ఎంత చదివిన ఆర్థిక స్తోమత అడ్డు వస్తుంది అనే ఆందోళనలో ఉన్న వీరికి ఇంటికి పెద్ద కొడుకుగా.. బిడ్డలకు పెద్దన్న లహరీష్ రావు అండగ ఉన్నాడని.. మాకు ఇల్లు లేదు అంటే డబుల్ బెడ్రూం ఇల్లు ఇచ్చాడని, చదువు లకు ఇబ్బంది అవుతుంది అంటే పిల్లలు చదవు కు తానే అండగా ఉన్నాడని.. రెండవ బిడ్డ అఖిల మెడిసన్ విద్యకు ఆర్థిక చేయూత ఇచ్చి అండగ నిలిచాడని హరీష్ రావు గారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని.. హరీష్ రావు గారికి తల్లి రేణుక, బిడ్డ అఖిల కృతజ్ఞతలు ధన్యవాదములు తెలిపారు.

# అధికారుల తీరుపై సర్పంచ్‌ల ఆగ్రహం



**ప్రజాపక్షం/మద్దూరు/ధూళ్మిట్ట:** రైతుల, ప్రజల సంక్షేమం కోసం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన అధికారులు తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు అని పలువురు సర్పంచ్‌లు ఆరోపించారు. శనివారం ధూళ్మిట్ట మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రత్యేక అధికారి చింతపల్లి శారధ అధ్యక్షతన ఎంపిడిఓ మీసాల వీరరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేషంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధికారుల పనితీరుపై మండిపడ్డారు. వర్షాభావ పరిస్థితుల వేళ రైతు సమస్యల పరిష్కారానికి విద్యుత్ అధికారులు పలు విద్యుత్ సమస్యలను పరిష్కరించడం లేదని, మిడిల్‌ఫోల్‌లు, పలు గ్రామాల్లో లూజ్ వైరింగ్‌లాంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ, అధికారులు గ్రామాల్లోనే అందుబాటులో ఉండి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేషంలో ధూళ్మిట్ట మండల తహసీల్దార్ శ్యామ్, మండల విద్యాశాఖ అధికారి అనుముల కర్ణాకర్ రెడ్డి, ఉమ్మడి మద్దూరు, ధూళ్మిట్ట మండలాల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎండి. ఆసిఫ్, మెడికల్ ఆఫిసర్ రజిత, ధూళ్మిట్ట మండల విద్యుత్ ఎఈ కె.రాజు, మండల పంచాయితీ ఆఫీసర్ జి.మోహన్, ఐసిడిఎస్ వి. రమదేవి, మండల పశువైద్య అధికారి సాజిద్ ఆలి, ధూళ్మిట్ట మండల ఇరిగేషన్ ఎఈ నజియా ఆఫ్రోజ్, ఆర్అండ్‌బి ఎఈ. పి శ్రీశైలం, మిషన్ భగీరధ (ఆర్‌డబ్లుఎస్) ఎఈ. ప్రవళిక, వివిధ శాఖల అధికారులు, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లతో పాటుగా గ్రామ పంచాయితీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## పోషణ మాసం దినోత్సవం



**ప్రజాపక్షం / నిజాంపేట్ :** జాతీయ పోషణ మాసం సందర్భంగా నిజాంపేట్ ఉన్నత పాఠశాల లో శనివారం రోజున పోషణ మాసం కార్యక్రమం ఐసిడిఎస్సిసూపర్ వేజర్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలకు పోషణ లోపం లేకుండా ఉండడానికి సరియైన ఆహారము తీసుకోవాలని పౌష్టికాహారం గురించి వివరించడం జరిగింది. ఆహార పదార్థాలలో భాగంగా ఆకుకూరలు, కూరగాయలు, పాలు మరియు పండ్లు తీసుకోవాలి అని వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యతల పాటించాలని తెలియజేయడం జరిగింది. అనంతరం పోషణ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానమాల, అంగన్వాడి టీచర్లు అరుణ,దుర్గేశ్వరి, రేణుక, మంగ,సునీత,శోభ, తదితరులు పాల్గొన్నారు.

## అనాథ వృద్ధ మహిళలకు ఆశ్రమం

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** పటాన్‌చెరు మండల పరిషత్ దుకాణ సముదాయం సమీపంలో అనాథగా ఉన్న వృద్ధ మహిళలకు జిల్లా మహిళా శిశు వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఆశ్రయం కల్పించారు. పటాన్‌చెరు మండల పరిషత్ దుకాణ సముదాయం పక్కన గుర్తుతెలియని వ్యక్తులు సుమారు నాలుగు రోజుల క్రితం వృద్ధ మహిళను వదిలి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అప్పటి నుంచి ఆమె అక్కడే ఉండటంతో పరిసర ప్రాంతాల వారు మానవతా దృక్పథంతో ఆమెకు భోజనం అందిస్తూ వచ్చారు. ఈ విషయాన్ని స్థానికులు జిల్లా మహిళా శిశు, వికలాంగుల ,వయోవృద్ధులు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె వృద్ధ మహిళకు సురక్షితమైన ఆశ్రయం కల్పించాలని జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్ అదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు ఫీల్డ్ రెస్పాన్స్ అదికారి తన సిబ్బంది కలిసి వృద్ధ మహిళకు భోజనం అందించారు. అనంతరం అవసరమైన దుస్తులు అందించి ఆమెను అమీన్‌పూర్‌లోని మహిమ మినిస్ట్రీస్ వృద్ధుల ఆశ్రమానికి తరలించి ఆశ్రయం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాథలు నిరాశ్రయులు, వృద్ధులు, మహిళలు తదితరులు పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఎవరైన నిరాశ్రయులుగా కనిపిస్తే సంబందిత సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీణ, ప్రమీల, జబ్బర్, అల్తాఫ్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పి పోయిన బాలిక లభ్యం



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రామచంద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బాంబే కాలనీకి చెందిన 4 సంవత్సరాల బాలిక శనివారం ఉదయం 11.00 గంటల ప్రాంతంలో తప్పిపోయినట్లు బాలిక తల్లిదండ్రులు డయల్ 112 ద్వార పోలీసులకు సమాచారం అందించగా వెంటనే రామచంద్రపురం పోలీస్ స్టేషన్ పెట్రో మొబైల్ సిబ్బంది అప్రమత్తమై బాలిక కోసం గాలింపు చేట్టారు . పోలీసుల వేగవంతమైన చర్యలతో తప్పిపోయిన బాలికను ఆర్‌సీ పురం వరణ్ హస్పిటల్ సమీపంలోని మెయిన్ రోడ్డుపై గుర్తించారు. బాలికను సురక్షింతంగా ఆమె తల్లిదండ్రులు పవార్ అంకుష్, పవార్ లక్ష్మి లకు అప్పగించారు. పోలీసుల తక్షణ స్పందన తో బాలికను ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112 కు సమాచారి అందించాలని పోలీసులు సూచించారు.

## వినాయక నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**ప్రజాపక్షం/హత్నూర :** వినాయక నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ అన్నారు. శనివారం హత్నూర మండలం దౌల్తాబాద్ ,బోర్పట్ల గ్రామాలలో నిమజ్జనాలు జరుగనున్న చెరువులను సందర్శించి భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. చెరువుల వద్ద బారీకేడ్స్ భద్రీలైటింట్, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదతర అంశాలపై అధికారులతో చర్చించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసే నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హత్నూర తహసీల్దార్ ఫర్వీన్ షేక్ , జిన్నారం ఇన్స్‌పెక్టర్ రమణరెడ్డి ఎస్సై శ్రీదర్ రెడ్డి,తో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## జైపాల్ నాయక్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అద్యక్షులు బొమ్మారెడ్డి, గూడెం గ్రామ సర్పంచ్ జైపాల్‌నాయక్ జన్మదిన వేడుకలను గ్రామ పంచాయతీ పాలకవర్గం ఉప సర్పంచ్ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో బొమ్మారెడ్డి గూడెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. జైపాల్ నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీఈ పాలక వర్గసభ్యులు గ్రామ ప్రజలు గ్రామ సర్పంచ్ కు శాలువా తో సత్కరించి సన్మానం చేసి శుబాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రజనీ గోపాల్, వార్డు సభ్యులు మూడ్ గోపాల్ వడిత్య సుబాష్, నీలాబాయి, రాజు అశ్విత్‌కిట్టు మేనక గణేష్ , శారదా, బాబూలాల్ స్రవంతి గణపతి సర్వీస్ నాయక్, శంకర్ లక్ష్మ ణ్, శ్రీనివాస్‌రాజు, దేవిదాస్, రాజు పాండు మల్లేశంలు పాల్గొన్నారు.

## జామియా మసీదు కమిటీకి ఎన్నికలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ జనాబ్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ, అడ్వకేట్ మహ్మద్ జమాల్ షరీఫ్ కలిసి వినతి పత్రం సమర్పించారు. జనగామ జామియా మసీదు వక్ఫ్ కమిటీ పదవీకాలం 2023లోనే ముగిసినా ఇప్పటివరకు రెన్యువల్, ఎక్స్‌టెన్షన్ లేదా కొత్త కమిటీ ఏర్పాటు చేయలేదని తెలిపారు. వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే వక్ఫ్‌బోర్డు ప్రత్యక్ష నిర్వహణలోకి తీసుకోవాలని కోరారు.

## తక్కువ ఖర్చుతో పోషకాహారం ఆరోగ్యకరమైన జీవనం

**ప్రజాపక్షం/గోవిందరావుపేట :** పోషణ మాస మహోత్సవాల్లో భాగంగా పసర 5వసెంటర్ అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం పోషకాహారం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ ఏ జ్యోతి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో లభించే పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని తెలిపారు ముఖ్యంగా గర్భిణీలు బాలింతలు చిన్నారులు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు అనంతరం పోషకాహారం పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ భాను గర్భిణీలు బాలింతలు చిన్నారులు అంగన్వాడీ ఆయా సౌజన్యతదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలి

భీష్మనగర్‌లో కార్డెన్‌సర్చ్

**ప్రజాపక్షం/చిట్యాల :** నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించి ప్రజలు భాగస్వాములు కావాలని చిట్యాల సిఐ వై.సతీష్ అన్నారు. మండలంలోని భీష్మనగర్ గ్రామంలో చిట్యాల సిఐ వై సతీష్ ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ ఆపరేషన్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి ప్రజలకు శాంతిభద్రతలు, నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీలలో నిబంధనలు ఉల్లంఘించిన 22 వాహనాలపై జరిమానాలు విధించారు. అలాగే గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా గుడుంబా విక్రయిస్తున్నట్లు గుర్తించిన ఇద్దరిపై గుడుంబా కేసులు నమోదు చేశారు. అనంతరం సిఐ వై సతీష్ గ్రామస్థులతో మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఖ్యంగా జరిగిన ఫేక్ గోల్డ్ కేసు వంటి ఘటనలను ప్రస్తావిస్తూ, అపరిచిత వ్యక్తులు అనుమాస్పద కార్యకలాపాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామంలోకి కొత్తగా లేదా అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే వారి కదలికలపై అనుమానం ఉన్న సందర్భంలో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామ ప్రజలు పోలీసులకు సహకరించి నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ పోచంపల్లి సతీష్, ఎస్ఐలు రాజన్ కుమార్, ఓంపాల్, 15 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఏజెన్సీ గీత కార్మికులకు

# వృత్తి పింఛన్ మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/గోవిందరావుపేట :** ములుగు జిల్లాలో 2001 సంవత్సరం నుండి ఏజెన్సీ పేరుతో 25 కల్లు గీత సొసైటీలు రద్దు కావడం జరిగిందని అప్పటినుండి గీత కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గోవిందరావుపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో రిటైర్డ్ ఎంప్లాయ్ కొత్త మల్లయ్యగౌడ్ అధ్యక్షతన ముఖ్యుల సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్లు గీతకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఏజెన్సీ పేరుతో జిల్లాలో లో 25 సొసైటీలు రద్దు కావడంతో తాటి చెట్ల పై నుండి పడిన బాధితులకు ప్రభుత్వం నుండి ఎటువంటి ఎక్స్‌గ్రేషియాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు కనీసం వృత్తి ఫించన్ 350 జీవో ప్రకారం 50 సంవత్సరాల నిండిన ప్రతి గీత కార్మికునికి రావాల్సి ఉండగా అది కూడ రావడం లేదని ఈ విషయంలో మంత్రి సీతక్క స్పందించి 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికునికి వృత్తి ఫించన్ అందేలా అధికారులను ఆదేశించాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు.

ఏ వృత్తిదారులకు లేని పింఛన్ సమస్య కేవలం ఏజెన్సీలో అనాదిగా గీత వృత్తి చేస్తున్న గీత కార్మికులకే ఉందని ఆయన అన్నారు కులం సర్టిఫికెట్ ఆధారంగా 50 సంవత్సరాలు నిండిన వారందరికి వృత్తి ఫించన్ మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రి సీతక్క కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట మండల అధ్యక్షుడు రుద్రబోయన మల్లేష్ గౌడ్ కార్యదర్శి వత్సవాయి సారయ్య గౌడ్ సంఘం సీనియర్ నాయకులు కాసగాని బిక్షం గౌడ్ గోవిందరావుపేట సొసైటీ అధ్యక్షులు కాసగాని స్వామి గౌడ్ బోలగాని చంద్రయ్యగౌడ్ సీనియర్ నాయకులు కందుల బాబు గౌడ్ బండి రాజశేఖర్ గౌడ్‌తో పాటు 20 మంది గీత కార్మికులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి

టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల జెఏసి చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘ నాయకులు ఎంజిఎం సూపర్డెంట్ డాక్టర్ కె.రామ్ కుమార్ రెడ్డి, ఎడి బాలాజీలను కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ , వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్ టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గాజె వేణుగోపాల్‌లు ఎంజీఎం సూపర్డెంట్ రామ్ కుమార్ రెడ్డి తో మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా కారుణ్య నియామకాలు చేపట్టకుండా ఉండడంవల్ల కారుణ్య నియామకాలకు అర్హులైన అభ్యర్థులు ఎంతగానో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జాప్యం కావడానికి కారణమైన సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ వెంటనే కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరారు.ఎంజీఎంలో అర్హులైన ఉద్యోగులు ఉన్న ప్రమోషన్లు ఇవ్వకుండా నాలుగో తరగతి ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెంటనే అర్హులైన ఉద్యోగులకు ప్రమోషన్లను ఇవ్వాలని కోరారు. ఆస్పత్రిలో గతంలో పనిచేసిన ల్యాబ్ టెక్నీషియన్స్ మరియు మెడల్ సిబ్బందిని తిరిగి తీసుకోవచ్చని ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వారిని విధుల్లోకి తీసుకోవడం లేదని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కారుణ్య నియామాలకు సంబంధించిన ఫైల్లు చూడాల్సిన ఉద్యోగులు మరియు సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించిన సందర్భంగా వారిపై తగిన చర్యలు తీసుకొనుటకు ఎంక్వయిరీ కమిటీని వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కార్యదర్శి బైరీ సోమయ్య,వరంగల్ జిల్లా కార్యదర్శి సదానందం, రాష్ట్ర నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దాస్య నాయక్,పుల్లూరు వేణుగోపాల్, పనికల రాజేష్,లక్ష్మీ ప్రసాద్, రామ్ నాయక్,పృథ్వి, ఆకుల సుధాకర్,రవీందర్, సాంబయ్య, రామ్ చంద్రయ్య పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఘనంగా గణేష్ ఉత్సవాలు

పాల్గొన్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో వరంగల్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ, భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజ మరియు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిఆర్ ఎస్ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీష్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం

ఐసిడిఎస్ ప్రాజెక్టు పరకాల సిడిపిఒ స్వాతి

**ప్రజాపక్షం/నడికూడ :** పరకాల ప్రాజెక్టు పరిధిలోని నడికూడ మండల కేంద్రములొని రాయపర్తి సెక్టార్ పులిగిల్ల I అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా సీడీపీవో స్వాతి హాజరై మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు,చిన్నారులు, తల్లులు ఆరోగ్యకరమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.పోషకాహారం ద్వార తల్లి బిడ్డ ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని చిన్నారులకు ప్రభుత్వం అందిసున్న బాలామృతాన్ని తప్పనిసరిగా అందించి వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లులు సహకరించాలని సూచించారు.ఇందులో భాగంగా పోషణ ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమంతో పోషణ అభియాన్ బీసి బిక్షపతి, రాయపర్తి సెక్టార్ సూపర్వైజర్ శ్రీదేవి,హెల్త్ డిపార్ట్మెంటు సూర్యకాంతం,హెల్త్ సూపర్వైజర్ ప్రశాంతి,ఏఎన్ఎం,శారద,పాఠశాల హెడ్మాస్టర్ సంపతి రెడ్డి,టీచర్ సతీష్, అంగన్ వాడీ టీచర్ రాజేశ్వరి, హేమలత,సూర్యాకళ,ఆయా సారమ్మ, ఆశాలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



## ఘనంగా పైడకుల అశోక్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పటేల్ జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుతూ జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పటేల్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పటేల్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆక రాధాకృష్ణ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య పూజారి సురేందర్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగేంద్రబాబు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పల్లికొండ యాదగిరి మైప లాలయ్య ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మూగల చంటి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసరికాని హరికృష్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షులు హిదయతుల్లా తూడి భగవాన్ రెడ్డి, చిన్నపెల్లి రాంబాబు, శానం సత్యనారాయణ, ఎండీ హుస్సేన్, కుర్సం లక్ష్మీపతి, పొడెం నాగేశ్వరరావు, గూడూరు రంజిత్, మాటూరి పరమేష్, ఆక సతీష్, మండల సోషల్ మీడియా ఇంచార్జీ భూక్యా కుమార్ పాల్గొన్నారు.

## 21న అంబేద్కర్ యువజన సంఘం 50వ ఆవిర్భావ వేడుకలు

గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించాలి

**ప్రజాపక్షం/చిట్యాల :** అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 21న 50వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య పిలుపునిచ్చారు. శనివారం చిట్యాల మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ యువజన సంఘం రిజిస్ట్రేషన్ నంబర్ 1033/77 అని తెలిపారు. ఆవిర్భావ వేడుకలకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలతో పాటు మేధావులు, ఉద్యోగులు, శ్రేయోభిలాషులు కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా పాల్గొనాలని కోరారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమాల్లో తెలుపు రంగు గద్దె, నీలిరంగు కర్ర, నీలిరంగు జెండా గుడ్డను ఉపయోగించాలని తెలిపారు. మహనీయుల ఆశయాల సాధనకు కృషి చేస్తూ మృతి చెందిన వారికి ఘనంగా నివాళులర్పించాలని పుల్ల మల్లయ్య కోరారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

పోస్ట్‌మాస్టర్ బీరెల్లి రమేష్

**ప్రజాపక్షం/గోవిందరావుపేట :** స్వచ్ఛత హి సేవ 2026 కార్యక్రమంలో భాగంగా పసర పోస్టాఫీసు ఆవరణలో శనివారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు పోస్టాఫీసు సిబ్బంది పరిసరాలను శుభ్రం చేసి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా పోస్ట్‌మాస్టర్ బీరెల్లి రమేష్ మాట్లాడుతూ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు కొబ్బరి బొండాలు ఇతర వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను తమ బాధ్యతగా భావించి పరిసరాను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు పరిశుభ్రమైన పరిసరాతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పోస్టుమ్యాన్ సయ్యద్ వహీద్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు ఇర్ప వెంకటేశ్వర్లు సందీప్ రెడ్డి సాధనబోయిన రాజ్‌కుమార్ మనోజ్ ప్రణతి సాంబయ్య మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** విద్యార్థులు రక్షణకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ వేధింపులపై అవగాహన పెంచుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి సందీప సూచించారు. శనివారం వాణి హై స్కూల్‌లో జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ, జనగామ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రిన్సిపల్ భాస్కరుని సుమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్జి కుమారి సందీప, బచ్చన్నపేట ఎస్ఐ శ్రీకాంత్, న్యాయవాది, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్ పాల్గొని పోక్సో, సైబర్ నేరాలు, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు యాదగిరి, చంద్రయ్య, సూపరిండెంట్ సీతారామ రాజు, ఉపాధ్యాయులు శ్రీలత, హైమావతి, మౌనిక, అనూష, శ్వేత, వాణి, తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదంలో ఇరువురికి బైండోవర్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** బచ్చన్నపేట గ్రామ పరిధిలోని చిన్నరామన్‌చర్ల రెవెన్యూ గ్రామ శివారులోని వివాదాస్పద భూమికి సంబంధించి దామర మహేష్, గుర్రాల నరసిరెడ్డి, మధ్య గత కొంతకాలంగా తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ వివాదంపై ఇప్పటికే ఇరువురిపై పరస్పర దాడులకు సంబంధించి నాలుగు కేసులు నమోదయ్యాయి. తాజాగా శనివారం ఇరువురి మధ్య మరోసారి ఘర్షణ జరుగడంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బచ్చన్నపేట పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా ఇరువురిని తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. భూ వివాదాలను ఎవరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా సంబంధిత రెవెన్యూ అధికారులు లేదా న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. గొడవలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రజలు శాంతియుతంగా వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని బచ్చన్నపేట పోలీసులు కోరారు.

## యాదవ సంఘం భూమి అక్రమ రిజిస్ట్రేషన్

### గొర్రెల పెంపకందారులు నిరసన

**ప్రజాపక్షం / జనగామ :** జనగామ మండలం పెద్దపహాడ్ గ్రామానికి చెందిన శ్రీ మల్లికార్జున గొర్రెల, మేకల పెంపకందారులకు చెందిన సర్వే నెంబర్ 582/ఎఫ్,583/జి/5లోని నాలుగు ఎకరాల 4 గుంటల భూమి ఉస్మానియా ఆగ్రో ఇండస్ట్రీస్ సంస్థ నకిలీ సంతకాలతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుందని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం నాయకులు ఆరోపించారు. శనివారం భూమిని సందర్శించి పరిశీలించడంతో పాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కమిటి నాయకులు మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ 130 మంది సభ్యులతో ఉన్న భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బనుక సద్దిరాజ్ యాదవ్, పునమాణి రజాక్ యాదవ్, తొట్లె నరేందర్ యాదవ్, బొంగు ఐలయ్య యాదవ్, గాజుల సిద్దిలింగం యాదవ్, మేకల మహానంది యాదవ్ సాదం మధు సూదన్ పాల్గొన్నారు.

## చరిత్ర తెలుసుకున్న వాడే చరిత్ర సృష్టించగలడు

### ఎంఇఒ అనుముల కర్ణాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/మద్దూరు/ధూళిమిట్ట :** చరిత్ర కేవలం పుస్తకం కాదు, మన భవిష్యత్తును నిర్మించే మార్గదర్శకం అని, ప్రత్యక్ష అనుభవంతోనే చరిత్రపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందుతుందని, ఈ దశలో చరిత్రను తెలుసుకున్న వాడే చరిత్రను సృష్టించగలడు అని ధూళిమిట్ట మండల విద్యాశాఖ అధికారి అనుముల కర్ణాకర్ రెడ్డి పేర్కొన్నారు. ధూళిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మండల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం రంజిత్, రాములు మరియు తెలంగాణ కొత్త చరిత్ర బృందం కొలిపాక శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో '' చారిత్రక వస్తువుల ప్రదర్శన శాల '' ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ధూళిమిట్ట మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అయిన అనుముల కర్ణాకర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో పాత మరియు కొత్త రాతియుగం నాటి సూక్ష్మ రాతి పరికరాలు , ఆయుధాలు, శాతవాహనుల కాలం నాటి టెర్రకోట బొమ్మలు, ఇక్ష్వాకులు, శాతవాహనుల కాలం నాటి నాణేలు, బహమనీ సుల్తానుల నాణేలు, డైనోసార్ల కాలం నాటివృక్ష శిలాజాలు, సిధు నాగరికత కాలం నాటి బొమ్మలు, ఆట వస్తువులు,అమ్మతల్లి దేవతా ప్రతిమలు తదితర చారిత్రక వస్తువులను విద్యార్థులు మండల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం మరియు తెలంగాణ కొత్త చరిత్ర బృందం సహకారంతో ప్రదర్శించి వాటి చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి అనుముల కర్ణాకర్ రెడ్డి మాట్లాడుతూ, చరిత్రలో ఆనాటి ప్రజలు ఉపయోగించిన వస్తువులను ప్రత్యక్షంగా చూసి తెలుసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించడం అభినందనీయం అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో చారిత్రక వారసత్వం పట్ల గౌరవం, అవగాహన పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధూళిమిట్ట మండల సోషల్ ఫోరం కన్వీనర్ సుద్దాల రంజిత్ కుమార్, సీనియర్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు నాగులపల్లి రాములు, పాఠశాల ఉపాధ్యాయుల బృందం, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నవరాత్రోత్సవాలు



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** వినాయక నవరాత్రులను పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలో గణనాథులను స్మరించుకుంటూ ప్రతి రోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి పట్టణంలోని గణనాథులను దర్శించుకుంటూ,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలతో మమేకమై వినాయక నవరాత్రి ఉత్సవాలలో ఒకే రోజు 33 వినాయక మండపాలను దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని భారత్‌నగర్, ఇందిరమ్మ కాలనీ, ధోబీగల్లి, లింగారెడ్డిపల్లి, నాసరపుర, వెంకటేశ్వర గుడి పరిసర ప్రాంతాలతో పాటు పట్టణంలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు. ప్రతి మండపం వద్ద వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు,యువత, మహిళలు, కాలనీవాసులు,పెద్దలు ఘన స్వాగతం పలికారు. యువత,ఉత్సవ కమిటీ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజల మధ్య ఉండటం,ప్రజలతో కలిసి పండుగలు జరుపుకోవడం, ప్రజల ఆప్యాయతను పొందడం.. ఇదే వంగ రాజేశ్వర్ రెడ్డి,ప్రజా బంధానికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. వినాయకుడి ఆశీస్సులతో సిద్దిపేట నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఒకే రోజు 33 మండపాలు.. అడుగడుగునా ప్రజల ఆత్మీయత, యువతలో ఉత్సాహం కనిపించింది.

## వార్డు మెంబర్ల ఫోరం నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/కొండపాక:** కుకునూరు పల్లి మండల వార్డు మెంబర్ల ఫోరం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల వార్డు సభ్యులు సమావేశమై నూతన కమిటీని ఏర్పాటు చేశారు. వార్డు సభ్యుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు గ్రామాల అభివృద్ధిలో సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. కుకునూరు పల్లి మండల,అధ్యక్షుడిగా దేవి నర్సింలు, ఉపాధ్యక్షులుగా కన్నెబోయిన వెంకటరెడ్డి, కుమ్మరి నరసింహులు కార్యదర్శిగా గడ్డం నరేష్. సహాయ కార్యదర్శిగా వెంకట్ చారి కన్నమైన వెంకట్. కోశాధికారిగా సిద్దోజి సత్యమూర్తి, సలహాదారులుగా, గంపల రాజు, పెరిక కిషన్ దున్నపోతుల రాజు కుమార్, కార్యవర్గ సభ్యులుగా బండారి కరుణాకర్, కంచి కవిత కరుణాకర్, మహమ్మద్ శేరిపోద్దీన్ లను ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నూతన కార్యవర్గం వార్డు సభ్యుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## పిఆర్‌టియు టిఎస్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/టేకుమట్లః** మండల కేంద్రంలోని ఎంఆర్‌పిఎస్ భవనంలో పిఆర్‌టియు టిఎస్ సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు ఎండి హకీమ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి పిఆర్‌టియు టిఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రేగూరి సుభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో మండల అధ్యక్షులుగా ఎండి హకీమ్, ప్రధాన కార్యదర్శిగా పప్పుల సునీల్, అసోసియేట్ అధ్యక్షులుగా సోమిడి స్వామి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా వి ఉమాదేవి, మండల ఉపాధ్యక్షులుగా పసరగొండ నరేష్, మహిళా ఉపాధ్యక్షురాలిగా సిహెచ్ అర్చన, మండల కార్యదర్శిగా సంగినేని పృథ్వీరాజ్, మహిళా కార్యదర్శిగా ఎం నవతలు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మెరుగైన పిఆర్‌సి, పాత పెన్షన్ విధానం అమలు, హెల్త్ కార్డుల మంజూరు, పెండింగ్ డిఏలు, పెండింగ్ బిల్లులు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి త్వరలో సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు మహేందర్, రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు సదయ్య, ముత్యం రెడ్డి, సీనియర్ సభ్యులు నారాయణరెడ్డి, గిరిబాబు, రఘు, రావుల రామచంద్రు, భుజేంద్రచారి, మామిడి ప్రకాష్, మోజస్, వరప్రసాద్, శరత్‌చంద్ర, హరికృష్ణ, పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ జనగామ జిల్లా శాఖ ఎన్నికలకు నోటిఫికేషన్

**ప్రజాపక్షం / జనగామ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా శాఖ నిర్వాహణ కమిటి ఎన్నికలు 04 అక్టోబర్ 2026 రోజున నిర్వయించనున్నట్లు ఎన్నికల అధికారి, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఓ ఎస్ కిరణ్ ప్రకాష్ తెలిపారు. శనివారం ఆయనొక ప్రకటన చేస్తూ ఈ నెల 24న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ కమిటి సభ్యుల పదవులకు నామినేషన్లు స్వీకరించబడతాయన్నారు. నామినేషన్ల స్వీకరణ జనగామ ఆర్‌డిఓ కార్యాలయంలో ఉంటుందని, 26వ తేదీన ఉపసంహరణ, వచ్చే నెల నాలుగవ తేదీన ఎన్నికలు ఉంటాయన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందనారు. నామినేషన్ ఫీజు రూపాయలు పదివేలుగా నిర్ణయించడం జరిగిందని, నామినేషన్ ఫారాలు జనగామ ఆర్‌డిఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాల కోసం 7995087589 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

## యువ టూరిజం క్లబ్ పోటీలు



**ప్రజాపక్షం/మంగపేట:** ములుగు జిల్లా మంగపేట మండలంలో పాఠశాల కళాశాలల విద్యార్థులకు యువ టూరిజం క్లబ్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో టూరిజం అవగాహనపై స్కిట్స్ పాటలు నాటకాలు ఆర్ట్స్ క్రాఫ్ట్స్ వినూత్న ఆలోచనలు పోస్టర్ మేకింగ్ టూరిజం ప్రజెంటేషన్ తదితర విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలు ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో నిర్వహించారు. ఈ పోటీలలో జడ్పీహెచ్ఎస్ రాజుపేట జడ్పీహెచ్ఎస్ మల్లూరు జడ్పీహెచ్ఎస్ మంగపేట జడ్పీహెచ్ఎస్ కమలాపురం కెజిబివి మంగపేట ప్రభుత్వ జూనియర్ కాలేజ్ తదితర పాఠశాలలు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులను మండల విద్యాధికారిణి పోదెం మేనక అభినందించారు. విజేతలుగా ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో సోమవారం, మంగళవారం పాల్గొననున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నుండి సంతోష్ కుమార్, రవీందర్, సూర్య, జమున తదితరులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు మరింత ప్రతిభ కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని మండల విద్యాధికారిణి పొదెం మేనక ఆకాంక్షించారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



**ప్రజాపక్షం/చిట్యాలః** గురుపూజోత్సవం సందర్భంగా చిట్యాల మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 18 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శనివారం అవార్డులు ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సేవలను అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, నాణ్యమైన విద్యాబోధనకు విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి అవార్డులు అందజేశారు. అవార్డు పొందిన ప్రతి ఉపాధ్యాయుడిని శాలువా, మెమెంటో, సర్టిఫికెట్లతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రఘుపతి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ప్రోత్సహించడం ద్వారా విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లగరిగ కాంప్లెక్స్ హెచ్ఎం ర్యూస్సీ, జూకల్ గెజిటెడ్ హెచ్ఎం గిరగాని కృష్ణ, సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ గోల్కొండ బిక్షపతి, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.